## 7.2.11 మైనార్టీ కవిత్వం

మైనార్టీ అనే పదాన్ని సంఖ్యాపరంగా వెనుకబడిన వర్గాలుగా పరిగణిస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులు, బి.సి.లు మైనార్టీలుగా గుర్తింపబడినప్పటికీ నేటి ఆధునిక కవిత్వ ధోరణులలో బి.సి. కవిత్వం, క్రైస్తవ కవిత్వం, ముస్లిం కవిత్వం వేరు వేరుగా ఏర్పడ్డాయి. నేడు మైనార్టీ కవిత్వం అంటే ముస్లింవాద కవిత్వంగా పరిగణిస్తున్నారు.

ముస్లింలలో అనేక తెగలున్నాయి. వీరి మధ్య అంతః వైరుధ్యాలున్నాయి. కొంతమంది ప్రపంచంలోని ముస్లిందరిదీ ఒకే దేశమనే భావనతో ఉన్నారు. భారతదేశాన్ని మాతృ దేశంగా భావిస్తున్నా వీరిపైన, వీరి మత విశ్వాసాలపైన దాడులు జరగటం వల్ల తాము మైనారిటీలనే ఆలోచన తలెత్తింది. దీనికితోడు 1992 డిసెంబరు 6వ తేదీన బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత ఇది మరింత బలంగా స్థిరపడింది. స్కైబాబ సంపాదకత్వంలో వెలువడిన జల్ జలా కవితా సంపుటిలో ముస్లింవాద కవిత్వానికి మూలాలను ఈ విధంగా ప్రకటించారు.

"పుట్టీ పుట్టక ముందే
మెడలో ఐ.ఎస్.ఐ బిళ్ళ వేసి
నా చావును ధృవీకరించారు"[1] – అద్దె బతుకు

అని ఎస్.ఎ.ఆజీద్ ముస్లింలపై ఇతరుల అభిప్రాయాలను వ్యక్తం చేసారు. సమాజం లోనే ఒక పరాయి వానిలా ఒక పరాయి సమాజంలో బయటి వారితో సత్సంబంధాలు లేనివారు ముస్లింలని, బ్రిటిషువారి కృత్రిమ విభజనకు బలైన ఆ తరం, ఈ తరం ముస్లింలు బాధ్యత వహించవలసి ఉందని హిందువుల అభిప్రాయం. ముస్లింలు పాకిస్తాన్ అనుయాయులనీ భారతదేశంపట్ల వాళ్ళ

1. జల్ జలా, ముస్లింవాద కవిత్వం, సంపాదకుడు స్కైబాబ, నీలగిరి సాహితి, నల్లగొండ, 1998. పుట 47.



విధేయత ప్రశ్నార్థకమనీ హిందువులు విశ్వసిస్తారు. హిందువుల కళ్ళకు ముస్లింలు దోషులుగా కనిపిస్తారు (ఖాదర్ మొహియొద్దీన్, పుట్టు మచ్చ).

కన్నభూమి రెండుముక్కలైతే నేలను నమ్ముకున్న వారిపై చేసిన మారణహోమం, బాబ్రీ విధ్వంసపు నీడలో హైందవం జరిపిన నరమేధయాగం, యాభై ఏళ్ళ స్వతంత్ర భారతంలో అస్వతంత్రులై ఐ.ఎస్.ఐ. ఏజెంట్లుగా ముద్ర పడి చెలరేగిన సంక్షోభం, కాశ్మీర్‌లో మిలటరీ బూట్ల కింద నలిగిన వైనం, వివక్షకూ, అభద్రతకో, అవమానాలకూ దుర్భరదారిద్ర్యానికి బలవుతున్న జనం[1]... ఇవన్నీ మైనార్టీవాద కవిత్వంలోని వస్తువులే. ఇది రాజకీయ నేపథ్యమైతే, స్త్రీలు సమాజపరంగా పురుషాధికారపరంగా అణచివేతకు గురవటం సామాజిక నేపథ్యంగా కనిపిస్తుంది. ఒకవైపు స్వీయమతంలోని మూఢాచారాలు, మరోవైపు మాతృదేశంలో అస్తిత్వం గురించిన పోరాటం, ఒకవైపు అగ్రవర్ణానికి మరోవైపు కింది వర్ణానికి మధ్య నలిగిపోతూ ఏమైపోతున్నారో తమ ఉనికి ఏమిటో తెలియని అయోమయ స్థితిలో ఉన్నవారిని గురించి తెలియజేసే కవిత్వమే ముస్లింవాద కవిత్వం.

స్త్రీవాద కవిత్వం ఇచ్చిన ఆలోచనల ప్రభావం మైనార్టీవాదం మీద ఉంది. మగవాళ్ళే కాకుండా మహిళల అణచివేతకు దారితీసే సంప్రదాయాల్ని వ్యతిరేకిస్తున్నారు.

హనీఫ్ 'తలాక్...తలాక్...తలాక్...ఇది వేల సంవత్సరాల పాచి వాసన అని స్త్రీకి గౌరవంలేని వ్యవస్థను విమర్శించారు.

"ఔరత్ అంటే
పడగ్గదుల్లో
కాలిపోతున్న అగరొత్తులేనా ?"[2] – వందేళ్ళ కాపురాలు కావాలి.

1,2. జల్‌జలా, ముస్లింవాద కవిత్వం, సంపాదకుడు స్కైబాబ, నీలగిరి సాహితి, నల్లగొండ, 1998, పుట 68.

అని ప్రశ్నిస్తూ మెహర్ సంప్రదాయాన్ని తిరస్కరించారు హనీఫ్.

"నీ జీవిత కాలపు చీకటి దేహం సాక్షిగా
నాకు అర్థం కాని చూపులు విసిరే ఆ రెండు కళ్ళ మీదా
ఎవరో కప్పిన సెహరా సాక్షిగా"[1] – ఆదా హై చంద్రమా

'ఆదా హై చంద్రమా', కవితలో బురఖా సంప్రదాయ కట్టుబాట్లలో స్త్రీ పరిస్థితిని విమర్శించారు ఖాజా. ముస్లిం స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షను ప్రశ్నిస్తూ "బురఖా దుపట్టాల్ని పీలికలుగా చేసి నీ మీదికి విసిరేస్తున్నా"[2]నని షాజహానా, ఖౌసెఖిజాలో నిరసనను ప్రకటించారు. 'పర్దా హటాకే దేఖో!' కవితలో

"ఏ పరదాల మాటున ఎంత నైరాశ్యం
గూడు కట్టుకొని వుందో ?
వెర్రి ఆచారాల మట్టి వృక్షాలున్నచోట
ఒక్కసారి ముసుగు తీసి చూడు..."[3]

అని బురఖా వెనక స్త్రీకి చైతన్యం దొరకనివ్వని తమ మతం పట్ల ద్వేషం, ముస్లిం స్త్రీల దుస్థితి పట్ల వేదనను వ్యక్తం చేసారు. 'తలాక్'ను గురించి

'మూడు మార్లు తలాకంటే ముక్కలయ్యే ఓటి కాపురానిక్కూడ మళ్ళీ మళ్ళీ ముస్తాబై దుల్హన్‌లమై తేలిపోయే వాళ్ళ' మని ముస్లిం మతంలోని సంప్రదాయాలను వ్యతిరేకిస్తూ షాజహానా రచనలు చేసారు.

ఈ ధోరణిలోనే షహ్‌నాజ్ ఫాతిమా బురఖాను ఖండిస్తూ

"ఆమె ముఖం
శాశ్వత గ్రహణం పట్టిన చంద్రబింబం" [4] – ఔరత్

---

1,2,3. జల్‌జలా, ముస్లింవాద కవిత్వం, సంపాదకుడు, స్కైబాబ, నీలగిరి సాహితి, 1998, పుట 56, 78, 66.

4. అలావా, సంపాదకులు షాజహానా, స్కైబాబ, (ఎస్.కె.యూసఫ్‌బాబ), 2006, పుట 84.



ముస్లిం స్త్రీవాద కవిత్వం ఒక కొత్త స్వరాన్ని సంతరించుకుంది. లోపల ఉండే అణచివేతను వ్యతిరేకించకుండా వెలుపల వున్న అణచివేతను వివక్షను వ్యతిరేకించడం సాధ్యంకాదు.

స్కైబాబ 'హిజాబ్' కవితలో స్త్రీల పర్దాను ఈ విధంగా వర్ణించారు.

నా ముఖానికి వేలాడేసిన 'నఖాబ్'
ఎత్తి చూశావా ఎన్నడైనా
నా కళ్ళు
రెండు అమాస చంద్రుళ్ళను మోస్తుంటాయ్ !
ఈ మురికి గుంటలో
అత్తర్లు జల్లుకుంటూ ఎంత కాలం !
ప్రవాహంగా విస్తరించాలి కదా ![1] – హిజాబ్

సలీం బందిఖానాలో 'చుట్టూ జైలుగదిని మోస్తున్నట్లు'

"కాళ్ళకు సంకెళ్ళు తెంచుకొని
ఎప్పటికైనా లేస్తుందా
ముందుకి అడుగు".[2]

మైనారిటీ మతవాద దృక్పథానికి వ్యతిరేకంగా మైనారిటీ దృక్పథం వస్తుంది. తెలుగు సాహిత్యంలో మైనార్టీ కవిత్వం విలోమం (Subaltern) నుంచి సాగుతుంది. ఒకప్పుడు అనులోమ దృక్పథం కొనసాగింది కాని నేడు ప్రాంతీయవాదం, స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీవాదం విలోమ దృక్పథం నుండి

---

1. పదునెక్కిన పాట, సం. జి. లక్ష్మీనరసయ్య, దళిత సాన ప్రచురణలు, విజయవాడ, 1996, పుట 120.

2. అలావా, ముస్లిం సంస్కృతి కవిత్వం, సంపాదకులు, షాజహానా, స్కైబాబ, 2006, పుట 96.

కొనసాగుతుంది. తమ అస్తిత్వాన్ని, మతాన్ని, సంస్కృతిని ప్రశ్నిస్తూ ముస్లింవాద కవిత్వం తలెత్తింది. వచన కవితనే తమ కవిత్వానికి సాధనంగా ఉపయోగించారు.

గౌస్ మొహియుద్దీన్ 'జల్వా'లో 'కలలో కొచ్చినా చీకటినే కప్పుకు వస్తావే'[1] అని గొంగళి కప్పిన చాందినీలను గురించి స్త్రీలే కాదు పురుషులు కూడ ధిక్కరిస్తున్నారు. ఖాజా 'షరతు' కవితలో పురుషులు కూడా 'గోషా ధరించే తిరగాలని షరతు పెడుతున్నాం'[2] అని నిబంధించారు.

రచయిత్రులు, రచయితలు ఒకవైపు స్త్రీలపై విధించిన 'ఫత్వా'లను ఖండిస్తున్నా కొందరు గతం నా సంస్కృతి అనే వారూ ఉన్నారు. ఖాజా రచించిన ఫత్వా కవితా సంపుటి మత శాసనం వంటిది. జరిగి తీరవలసిందే ధిక్కారానికి తావులేదిక్కడ. షఫి 'స్కైలాబ్' కవితలో

"భవిష్యత్తరానికి మూల సృష్టి
రూపు దిద్దుకుంటున్న మూలపిండాన్ని తుంచేసి...
నా గతాన్ని కప్పేయాలనుకున్నావు...
నా సంస్కృతిని ధ్వంసం చేసి
నా చరిత్రను తుడి చేయాలనుకున్నావు".[3] – స్కైలాబ్

మహమ్మద్ ఖాన్ 'ముసుగు'లో మతం మర్రిచెట్టు నీడలో కాషాయ కొంగల గుంపు అమాయక కాపురాల రక్తం కళ్ళ చూస్తున్నదని మత రాజకీయ పరిస్థితుల ప్రభావాన్ని వర్ణించారు. చారిత్రక వైభవాన్ని చిన్నాభిన్నం చేసిన రామ్ జన్మభూమి కుట్రలని, రాముడు రాకాసి అని రాజకీయ కుటిలత్వానికి బలైన సంఘటనలను కవితా వస్తువుగా స్వీకరించారు. (భయకంపిత పావురాలం, యం.డి. అహ్మద్,

1. జల్‌జలా, ముస్లింవాద కవిత్వం, 1998, పుట 60.
2. ఫత్వా, ఖాజా, కళా పబ్లికేషన్స్, పాల్వంచ, 1998, పుట 6.
3. అలావా, ముస్లిం సంస్కృతి కవిత్వం, సంపాదకులు, షాజహానా స్కైబాబ, 2006, పుట 145.



పుట 139) నబి కె.ఖాన్ 'మూడోవాదం' కవితలో 'మందిరం' వద్దు, 'మసీదు' వద్దు మాకు విద్యాలయం, వైద్యాలయం కావాలని మతం పేరుతో మారణహోమం వద్దని ధర్మచక్రాన్ని నిలబెడదామని మూడోవాదాన్ని పేర్కొన్నారు.

"మట్టిలో మాణిక్యాల్ని వెలికి తీసే విద్యాలయం మాక్కావాలి
మానవత్వానికి నిలువుగోడల్లా నిలిచే వైద్యాలయం మాక్కావాలి"
'మానవ'తా వాదులారా రండి
అశోకుడి ధర్మచక్రాన్ని
అయోధ్య గల్లీకి తీసుకొద్దాం"[1] – మూడోవాదం

మరణానంతరం పొందే అమరసుఖాల పేరుతో వర్తమానంలో పెట్టే కుచ్చుటోపీ ముస్లింల జీవన వ్యవస్థను విమర్శిస్తుంది. సయ్యద్ గఫార్ 'మొమిన్ బాయియో' కవితలో

'పుట్టుకల్ని నియంత్రించడం పాపమెలా అవుతుంది' (జల్‌జలా, పుట 52, 53.)

అని నిలదీసి ప్రశ్నిస్తూ ఇది రాజకీయమని 'మేం ఓట్లను కనాలి' సంవత్సరానికో మారు ఇచ్చే 'ఫిత్రాలు' కోసం దరిద్ర ప్రతిరూపాలను కనాలని అధిక సంతాన భారాన్ని గురించి ఖండించి సంపదల్ని సమంగా పంచుకుందామా? అని మైనార్టీ వ్యవస్థను నిలదీసారు. అస్తవ్యస్త వ్యవస్థకి కారణమైన ప్రతి దానిని ఖండించారు మైనార్టీవాద కవులు.

ఆర్థిక, రాజకీయ,మత, సామాజిక పరిస్థితులను విమర్శించారు. అన్ని కోణాలను తెలుగు ముస్లిం కవిత్వం వ్యక్తం చేస్తుంది.

1. అలావా, ముస్లిం సంస్కృతి కవిత్వం, సంపాదకులు, షాజహానా స్కైబాబ, 2006, పుట 130.

కుల, మత, రాజకీయ, ఆర్థిక, సామాజిక నేపథ్యంలో తమ అస్తిత్వాన్ని నిలదొక్కుకోవటానికి ఉనికిని చాటుకోవటానికి ముందుకు వచ్చినదే ముస్లింవాదం. ముస్లింలు భారతీయులమని, దళితులని, అమాయక పావురాలని తమ అస్తిత్వాన్ని తెలియజేస్తూ ముస్లిం సంస్కృతి పరిరక్షణ, మత ఛాందస విముక్తి, హైందవ మత నీడల నుండి రక్షణ కావాలని కోరుకుంటున్నారు.

న్యాయబద్ధమైన స్వేచ్ఛాయుత సమాజం / స్థాయీ భేదాల అంతస్తుల దొంతరలు లేని సమతా సమాజం / కేవలం కొద్ది మంది చేతుల్లోనే సంపద సర్వం పోగుపడి వుండటానికి వీలు లేని సమాజం / ఆత్మ గౌరవంతో నిరాడంబర జీవితాన్ని అందరికీ అందించే సమాజం / భౌతికంగా, మానసికంగా యజమానీ – బానిస సంబంధాలను రద్దు పరిచే సమాజం / అంతస్సాక్షికీ, అభివ్యక్తికీ పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సమకూర్చే సమాజం / మానవ ప్రతిష్టకీ, ఆత్మ గౌరవానికీ భంగం వాటిల్లటానికి వీల్లేని సమాజం / మానవజాతి ఐక్యతని మత, నృజాతి, వర్ణ, వర్గ ప్రాదేశిక విభేదాలు మంటగలపటానికి వీల్లేని సమాజం / మనుషుల్ని విభజించి, వాళ్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను నియంత్రించే పిడివాదాలకు అవకాశంలేని సమాజం / లైంగిక వివక్షనీ, అన్యాయాన్నీ అనుమతించని సమాజం / సమస్త ప్రజానీకం సగర్వంగా తలెత్తుకుని తిరగ గలిగే సమున్నత సమాజం[1]. క్లుప్తంగా యిదీ ముస్లింవాదం ఆశిస్తున్న ఆదర్శ మానవ సమాజం.

ముస్లింల ఆచారవ్యవహారాలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఉంటాయి. ప్రపంచంలోని ముస్లింలందరి సంస్కృతి ఒకటి కాదు. దేశ ముస్లిం సంస్కృతుల్ని కాపాడు కోవాల్సిన అవసరం ఉందని ముస్లింవాద కవులు చర్చకు తెస్తున్నారు. ముస్లింవాదంలో స్త్రీ పురుష జండర్ వివక్ష ముస్లింలు ఇతల మతస్తుల నుండి

1. అలావా ముస్లిం సంస్కృతి కవిత్వం, సంపాదకులు షాజహానా, స్కైబాబ, నసల్ కితాబ్ ఘర్, 2006, పుట 10.



అస్తిత్వ పరిరక్షణ, పురోభివృద్ధి సామ్రాజ్యవాదానికి, పాశ్చాత్య సాంస్కృతిక విస్తరణ వాదానికి వ్యతిరేకంగా నిలవాలని తమ ముద్రణను నిలుపుకోవాలని, నిలదొక్కుకోవాలని ఆ లక్ష్యసాధనలో ముస్లింవాదం ఎదుగుతుంది.

ఖురాన్‌లో సత్యం, అహింస ప్రబోధింపబడింది. ఖురాన్‌ని ప్రపంచానికంతటికీ వినిపించేట్టుగా బిగ్గరగా పఠించమని ఇస్లాం చెపుతుంది. ఖురాన్ మానవ జన్మ ఉన్నత మైనదని మానవుడు పరిపూర్ణ జీవితాన్ని తృప్తిగా జీవించాలని చెప్పింది. మానవులందరు సమానమని చెబుతుంది. గ్రీకు దర్శనానికి కొనసాగింపుకు, ఐరోపా దర్శనానికి బీజాల నిచ్చిన ఇస్లాం పరిణామాలకు లోనయ్యింది. చాదర్ మియా, సాల్మన్ రష్దీ, తస్లీమా నస్రీన్ వంటి రచయితలు మార్పుకు పిలుపు నిస్తున్నారు.